

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (సోమవారం సాయంత్రం)	సెహరీ (మంగళవారం ఉదయం)
కడప	6.30	5.11
ప్రొద్దుటూరు	6.31	5.15



ఉమ్మడి రాష్ట్రంలో డ్వాక్రా మహిళా సంఘాలు ఏర్పాటు చేసి పొదుపు ప్రక్రియను మొదలుపెట్టింది సీఎం చంద్రబాబునాయుడే. ఇప్పుడు డ్వాక్రా గ్రూపులు దేశంలోనే ఆదర్శంగా ఉన్నాయి. సంఘాలు కోట్లాది రూపాయలతో లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. అయితే మహిళా సంఘాలను మరింత పటిష్టం చేసి ఆ సంఘాల ద్వారా తయారయ్యే ఉత్పత్తులను లోకల్‌గా కాకుండా ఈకామర్స్ వేదికగా బహిరంగ మార్కెట్లో విక్రయించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది.

డ్వాక్రాలో బలవంతపు కొనుగోళ్లు

- ఆన్‌లైన్ వేదికగా సంఘాల ఉత్పత్తులు
- భారంగా డెలివరీ చార్జీలు
- రూ.పది వస్తువు కొనుగోలు చేసినా రూ.36 వసూలు
- మార్కెట్ కన్నా ధర ఎక్కువ
- ప్రభుత్వ లక్ష్యం మంచిదే.. డెలివరీ చార్జీపై సబ్సిడీ భరిస్తే బెటర్

(కడప-ఆంధ్రజ్యోతి): ఇప్పుడంతా ఆన్‌లైన్ షాపింగ్ ట్రెండ్ నడుస్తోంది. అమేజాన్, ఫ్లిప్‌కార్ట్, మంత్ర, స్నాప్‌డీల్, మీషో ఇలా రకరకాల ఈకామర్స్ వేదికల ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయి. పాలప్యాకెట్ దగ్గర నుంచి కూరగాయల వరకు వీటిల్లోనే కొనుగోలు చేస్తున్నారు. ఆన్‌లైన్ కొనుగోలు ట్రెండ్ పసిగట్టి ప్రభుత్వం కూడా డ్వాక్రా సంఘం ఉత్పత్తులను ఈకామర్స్ వేదికగా అమ్మకాలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వీటిని ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ ఇక్కడ కొనుగోలు దారులపై భారం పడుతోంది. ప్రస్తుతం వ్యాపారంలో పోటీ ఉన్న నేపథ్యంలో మార్కెట్‌కు అనుగుణంగా అడుగు వేయాల్సి ఉంది. కానీ డ్వాక్రా ద్వారా కొనుగోలు చేసే ఉత్పత్తుల్లో పదిరూపాయల వస్తువు కొనుగోలు చేసినా రూ.36 డెలివరీ చార్జీగా చెల్లించాల్సి రావడం భారంగా మారింది.

జిల్లాలో 30 వేల డ్వాక్రా సంఘాలు

జిల్లాలో సుమారు 30 వేల డ్వాక్రా సంఘాలున్నాయి. దాదాపు 3లక్షల మంది సభ్యులున్నారు. డ్వాక్రా సభ్యులు చిరుధాన్యాలు, పచ్చళ్లు, బొమ్మలు, వస్త్రాలు ఇలా రకరకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వీటిని డ్వాక్రా బజారు, ఇతరత్రా వాటిల్లో విక్రయాలు సాగిస్తున్నారు. కొందరు ఇంటి నుంచే తాము తయారు చేసే ఉత్పత్తులను విక్రయిస్తున్నారు.

ఈకామర్స్ వేదికగా

డ్వాక్రా మహిళలు ఇంటి నుంచి తయారు చేసే ఉత్పత్తుల విక్రయాలను మరింతగా పెంచి వారికి ఆర్థిక స్వావలంబన పెంచేందుకు మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వారి ఉత్పత్తులను విక్రయించేందుకు ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ లాంటి రెండు సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. మహిళలు తయారు చేసే చిరుధాన్యాల తిండి పదార్థాలతో పాటు, చెక్కబొమ్మలు, దుస్తులు, జనపనార దుస్తులు ఇలా రకరకాల వస్తువులను వాటి ద్వారా విక్రయించాలని నిర్ణయించారు.

కొనుగోళ్లు భారం

మార్కెట్లో బఠానీలు కిలో రూ.140 ఉంది. అయితే ఇక్కడ ఈకామర్స్ ద్వారా కొనుగోలు చేస్తే రూ.36 ట్రాన్స్‌పోర్టు చార్జి చెల్లించాల్సి ఉంది. బెల్లం రూ.123.50, అలసందలు రూ.157, పప్పులు రూ.109, కందిపప్పు రూ.124, జొన్నలు రెండు కేజీలు రూ.104.50, మినుములు రూ.123. పెసరపప్పు రూ.114, చక్కెర రెండు కిలోలు రూ.104 ఉంది. అయితే వీటిపై ప్రతి దానికి రూ.35 డెలివరీ చార్జీ చెల్లించాలి. ఇదే భారంగా మారుతోంది.

సభ్యులకు టార్గెట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డ్వాక్రా సంఘం ఉత్పత్తులను ఈకామర్స్ వేదికగా చంద్రబాబునాయుడు ప్రారంభించారు. వీటి కొనుగోళ్లకు జిల్లా డీఆర్డీయే అధికారులు టార్గెట్ ఇచ్చారు. ప్రతిసంఘం నుంచి కొనుగోలు చేయాల్సిందంటూ వీఓలపై తీవ్ర స్థాయిలో వత్తిడి తెచ్చారు. దీంతో ఆ ఒత్తిడి భరించలేక రూ.50 వస్తువు కొనుగోలు చేసి మమ అనిపిస్తున్నారు. టార్గెట్ కోసం తప్ప ఈకామర్స్‌లో లోపాలను పరిశీలించకుండా ఇలా ప్రారంభించడం వల్ల పలు విమర్శలకు తావిస్తోంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలు కొనుగోళ్ల తరువాత ఉచిత డెలివరీతో పాటు రాయితీ కూపన్లు ఇస్తున్నాయి. ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినా మార్కెట్ పోటీని తట్టుకుని నిలబడేందుకు డెలివరీ చార్జీలను ప్రభుత్వం భరిస్తే మంచిదని అంటున్నారు.

అనుమానాస్పద మరణాల నిగ్గు తేలుస్తాం

- సిట్ విచారణ మొదలైంది
- ఆంధ్రజ్యోతితో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

వివేకా హత్య కేసులో కీలక సాక్షులు, కేసులో ప్రమేయం ఉన్నవారు ఆరేళ్ల వ్యవధిలో ఆరుగురు మృతి చెందారు. ఇది పెద్ద సంచలనంగా మారింది. పరిటాల రవి హత్య కేసులో నిందితులు ఎలా మృతి చెందారో వివేకా హత్య కేసులో కూడా అలాగే మృతి చెందారు.. అది కూడా అందరూ అనారోగ్యంతోనే. ఈనెల 5న వివేకా ఇంటి వాచ్‌మన్ మృతి సంచలనం రేపింది. ఈ విషయాలను కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ మరణాల వెనుక గుట్టురట్టు చేయాలని ఆదేశించడంతో సిట్ ఏర్పాటైంది.



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

కడప, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వివేకా హత్య కేసులో అనుమానాస్పద మరణాల వెనుక నిగ్గు తేలుస్తామని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సిట్ విచారణ మొదలు పెట్టిందని తెలిపారు. ముఖ్యంగా రంగన్న మృతిపై ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, ఇందుకు స్పెషల్ టీంను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: రంగన్న మృతి అనంతరం ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు ఇచ్చింది ?

ఎస్పీ: ఈ నెల 5న వివేకా హత్య కేసులో సాక్షి అయిన రంగన్న రిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించారు. ఇందులో భాగంగా ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశాం. స్పెషల్ టీంను ఏర్పాటు చేశాం. రంగన్న మృతి కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నాం. ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐలు, ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు సిట్ మెంబర్స్‌గా ఉంటారు. ఈ బృందం అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తుంది. మరణం వెనుక ఉన్న కారణాలు, ఏ పరిస్థితిలో మరణించారనే విషయంపై విచారిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వివేకా హత్య కేసులో కీలక సాక్షులుగా ఉన్నవారు వరుసగా మరణించడంతోనే ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందా ?

ఎస్పీ: 2019 నుంచి ఇప్పటివరకు ఆరుగురు మరణించారు. వారి మరణాలు అనారోగ్య కారణాలతో అనే ప్రచారం జరిగింది. దీని వెనుక ఉన్న కోణాన్ని కూడా విచారించాల్సిన అవసరం ఉంది. రంగన్నకు సంబంధించిన కేసులో అన్ని కోణాల్లో విచారిస్తున్నాం. అంతకుముందు జరిగిన మరణాల వెనుక కారణాలు, ఏ సందర్భాల్లో జరిగాయన్న దానిపై ఆరా తీస్తున్నాం. ఈ మృతి హైలీ సస్పీషియస్ మరణంగా భావించి దాన్ని కూలంకషంగా విచారిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పోలీసుల వేధింపుల వల్లే చనిపోయాడని రంగన్న భార్య ఎందుకు ఆరోపిస్తున్నారు?

ఎస్పీ: 2019 నుంచి కూడా రంగన్నకు సెక్యూరిటీ కల్పించాం. పోలీసుల నుంచి అన్ని భద్రతా చర్యలు తీసుకున్నాం. ఇందులో భాగంగా సీబీఐ ఎంక్వైరీలో అతన్ని సాక్షిగా పరిగణించారు. పోలీసుల టార్చర్ వల్ల చనిపోయాడని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు. విచారణలో అన్ని విషయాలు బయటకు వస్తాయి.

ఆంధ్రజ్యోతి: శ్రీనివాసరెడ్డి, గంగాధర్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, రంగన్న మృతిచెందడంతో పాటు ఈసీ గంగిరెడ్డి మరణంపై కూడా విచారణ జరుపుతారా ?

ఎస్పీ: సాక్షులుగా ఉన్న వారి మరణాల వెనుక గల కారణాలపై ఆరా తీస్తున్నాం. ఏ సందర్భాల్లో మరణించారనే దానిపై విచారణ చేయాల్సిన అవసరం ఉంది.

ఆంధ్రజ్యోతి: సిట్ విచారణ ఎప్పుడు మొదలుపెడతారు ?

ఎస్పీ: రంగన్న విషయంలో సిట్ ఏర్పాటు చేశాం. రీపోస్టుమార్టం చేసి శాంపిల్స్‌ను సేకరించాం. సిట్ బృందం ఎంక్వైరీ కూడా మొదలుపెట్టింది.

ఆంధ్రజ్యోతి: సాక్షుల మరణాలపై ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. విచారణ పూర్తికి సమయం కేటాయించిందా?

ఎస్పీ: విచారణ అనేది చాలా అంశాలపై ఆధారపడి ఉంటుంది. రంగన్న మృతిపై వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేసి నివేదిక పంపుతాం.

ప్రొద్దుటూరులో దొంగల భయం

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- లక్ష్మీనగర్‌లో భారీగా నగలు, నగదు చోరీ
- పోలీసులకు సవాల్‌గా మారిన వైనం



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

ప్రొద్దుటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో దొంగల భయం ఎక్కువైంది. ఇటీవల కాలంలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఇది పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. ఒకవైపు బయటి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇంటి యజమానులు పోలీసులకు సమాచారం తెలపాలని, అప్పుడు వారి ఇంటిపై నిఘాపెట్టి చోరీ జరగకుండా చూసుకుంటామని చెబుతున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఇదే అదనుగా దొంగలు తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని భారీగా స్కెచ్ వేసి ఇళ్లను లూటీ చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో కాకుండా ఏకంగా మెయిన్ రోడ్డుపక్కనే వున్న గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో సీసీ కెమెరాల నిఘా, రాత్రి పగలు వాచ్‌మెన్‌లు వున్న చోట రెండుసార్లు చోరీలు జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే...

ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్‌లో ప్లాట్‌నెంబరు 19 గల ఇంట్లో రెండురోజుల క్రితం భారీ చోరీ జరిగింది. నగదు, భారీగా ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాల మేరకు మార్చి 7న లక్ష్మీనగర్ ప్లాట్‌నెంబరు 19 ఇంటి యజమాని వల్లంకొండు రఘువంశీ మధ్యాహ్నం 3 గంటలకు తన తల్లి అనారోగ్యం కారణంగా ఇంటికి తాళం వేసి బెంగుళూరుకు వెళ్లారు. కాగా 8న ఉదయం 6గంటలకు ఇంటి తలుపులు తెరిచి వుండటం రఘువంశీ బంధువులు గుర్తించారు. ఈ విషయాన్ని వెంటనే బెంగుళూరులో వున్న బాధితుడికి తెలుపగా వారు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో డీఎస్పీ భావన, సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐలు రఫీ, సురేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను రప్పించి పరిశీలించారు. కాలనీలోని వాచ్‌మెన్‌లను, సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. ఇందులో ముగ్గురు వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలను బట్టి పోలీసులు గుర్తించారు. భారీ చోరీకి పాల్పడ్డ దొంగలను పట్టుకునేందుకు పోలీసులతో స్పెషల్ టీంలు వేసి గాలిస్తున్నట్లు తెలిపారు. కాగా ఆదివారం కడప క్రైం బ్రాంచ్ పోలీసులు, డీఎస్పీ భావన చోరీ జరిగిన ఇంటిని పరిశీలించినట్లు తెలిసింది.

నగదు, బంగారు ఆభరణాలను రికవరీ చేయాలి



విలేకర్లతో మాట్లాడుతున్న రఘువంశీ

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె పంచాయతీలోని తన నివాసంలో చోరీ జరిగిన సొమ్ము, బంగారు ఆభరణాలను రికవరీ చేసి ఇవ్వాలని వల్లంకొండు రఘువంశీ పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బెంగుళూరులో చికిత్స పొందుతున్న తమ తల్లిని చూడటానికి 7వ తేది మధ్యాహ్నం భార్యాపిల్లలతో కలిసి వెళ్లామని, చోరీ జరిగిన విషయం తెలుసుకుని శనివారం మధ్యాహ్నానికి ప్రొద్దుటూరుకు చేరుకున్నామని తెలిపారు. ఇంట్లోకి వెళ్లి గమనించగా 1147 గ్రాముల బంగారు ఆభరణాలు, 600 గ్రాముల రెండు వెండిప్లేట్లు, రూ.7.70 లక్షలు నగదు, దొంగతనం జరిగినట్లు గుర్తించామన్నారు. చోరీ సొమ్ము, ఆభరణాలను త్వరగా రికవరీ చేసి తమకు అప్పగించాలని కోరారు. ఈ సమావేశంలో రిటైర్డు ప్రిన్సిపల్ దామోదర్, సత్యం, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కాసులీ మాత.. నమోస్తుతే

- కనుల పండువగా ఆలయ వార్షికోత్సవం



తెప్పోత్సవ కార్యక్రమ దృశ్యం



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

కడప కల్చరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగర అమ్మవారిశాల వీధిలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం పునఃప్రతిష్ఠ కాబడి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురష్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వేద పండితుల సూచనల మేరకు వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో వెలసివున్న వినాయకస్వామి, సుబ్రమణ్యస్వామి, నగరేశ్వరస్వామి, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి, సీత, రామ, లక్ష్మణ, హనుమంతుల స్వామివార్లకు అత్యంత వైభవంగా అభిషేకం గావించారు. అనంతరం సుదర్శన హోమం నిర్వహించారు.

నయనానందకరంగా తెప్పోత్సవం

ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సాగిన తెప్పోత్సవ కార్యక్రమం నయనానందకరంగా సాగింది. ఆలయం ఆరుబయట నూతనంగా అమ్మవారి తెప్పోత్సవానికి ఏర్పాటు చేసిన చిన్నపాటి తొట్టిలో ప్రత్యేకంగా నీటిని నింపి అందులో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ప్రతిమను 5 సార్లు తెప్పోత్సవం గావించారు. ప్రతిరౌండ్‌కు అమ్మవారికి హారతి తీసే కార్యక్రమం అత్యంత మనోహరంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి తెప్పోత్సవాన్ని తిలకించి పరమానంద భరితులయ్యారు.

ఉపాధ్యాయుల పదోన్నతులకు కసరత్తు

- అభ్యంతరాల సవరణకు ప్రత్యేక కమిటీలు
- నేటితో ముగియనున్న పరిశీలనలు

5



బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం

- ఏప్రిల్ 11న జరిగే కల్యాణోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు
- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



మహాసంప్రోక్షణలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దంపతులు

రాజంపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని, ఏప్రిల్ 11న జరిగే కోదండరాముని కల్యాణోత్సవానికి చురుగ్గా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఒంటిమిట్ట కోదండరామాలయ బ్రహ్మోత్సవాల నిర్వహణపై పరిపాలనా భవనంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, టీటీడీ, జిల్లా అధికారులతో ఆదివారం సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒంటిమిట్టలో జరిగే కల్యాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. టీటీడీ అధికారులు, సిబ్బంది, కడప జిల్లా అధికారులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని, భక్తులందరికీ ముత్యాల తలంబ్రాలు, ప్రసాదాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. భక్తులు భారీ సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లు సౌకర్యాలు కల్పించాలన్నారు. టీటీడీ విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. కల్యాణోత్సవం రోజున విద్యుత్ అంతరాయం కలగకూడదన్నారు. అవసరమైన జనరేటర్‌లను కూడా సిద్ధం చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆహ్వాన పత్రికలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు తాగునీటి సమస్య, అన్న ప్రసాదాలు, నిత్యావసర సేవలు, అవసరమైన మందులు నిల్వ ఉంచాలన్నారు. అంతకు ముందు కల్యాణవేదిక ప్రాంగణాన్ని చైర్మన్ పరిశీలించారు. కల్యాణవేదిక ప్రాంగణాన్ని బాగా అలంకరించాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల నిర్వహణపై జేఈవో వీరబ్రహ్మం టీటీడీ చైర్మన్‌కు వివరించారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

15న అమరావతిలో శ్రీనివాస కల్యాణం

అమరావతిలోని వెంకటపాలెంలో ఈనెల 15న శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్నట్లు టీటీడీ చైర్మన్ తెలిపారు. కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అమరావతిలోని టీటీడీ వెంకటేశ్వరాలయంలో తొలిసారి శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకు తగ్గట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను వేద పండితులు ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మహా సంప్రోక్షణ ఉత్సవాల్లో చైర్మన్ దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

జాతీయ లోక్‌అదాలత్‌కు ఐదో ర్యాంకు

- 7546 కేసులు పరిష్కారం
- రూ.26,13,95,784లు చెల్లింపు
- జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మార్చి 8 శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కడప జిల్లాకు 5వ ర్యాంకు దక్కిందని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఆయా కోర్టులలో 19 బెంచ్‌లను ఏర్పాటు చేసి మొత్తం 7546 కేసులు పరిష్కరించామని, ఇందులో 7231 క్రిమినల్ కేసులు, 197 సివిల్ కేసులు, 118 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. వీటిలో కడపలో 2109 కేసులు, ప్రొద్దుటూరులో 2082 కేసులు, రాజంపేట 933, రాయచోటిలో 240, బద్వేలులో 283, జమ్మలమడుగులో 1005, సిద్ధవటంలో 137, రైల్వేకోడూరులో 157, పులివెందులలో 365, నందలూరులో 80, లక్కిరెడ్డిపల్లెలో 26, కమలాపురంలో 129 కేసులు పరిష్కరించినట్లు వెల్లడించారు. పై మొత్తం కేసుల పరిష్కారానికి కక్షిదారులకు రూ.26,13,95,784లు చెల్లింపులు జరిగాయని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ అధికారులు, ఇన్సూరెన్స్, బ్యాంకు అధికారులు, తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

జీఎస్ఓసీ ఇంటర్న్‌షిప్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్ గుప్త

వేంపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీఎస్ఈ ఫైనలియర్ చదువుతున్న అజాద్ గూగుల్ సమ్మర్ ఆఫ్ కోడ్ (జీఎస్ఓసీ) ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా పూర్తిచేసినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సమర్పించిన వేలాది ప్రాజెక్టులలో అజాద్ ప్రాజెక్టు ప్రత్యేకంగా నిలిచిందన్నారు. టాప్ 1000 ప్రాజెక్టులలో ఒకరిగా నిలిపిందన్నారు. అజాద్ తన సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవడమే కాకుండా రూ.2,50,000 స్టైఫండ్ అందుకున్నాడన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్, సీఎస్ఈ హెచ్ఓడీ రత్నకుమారి, ఏఓ రవికుమార్, అకడమిక్ డీన్ రమేష్ కైలాష్‌లు అభినందించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

పులివెందుల రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఉలిమెల్ల లేక్‌లో ఆదివారం నిర్వహించిననృత్య ప్రదర్శనలు అలరించాయి. పరిపాలన అధికారి సుధాకర్ పర్య వేక్షణ వేంపల్లెకు చెందిన సంసిద్ సతీష్ రెడ్డి స్కూల్ చిన్నారులు శబరీష్ డ్యాన్స్ మాస్టర్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు. శాస్త్రీయ, జానపద, సినిమా పాటలకు నృత్యాలతో పాటు కైక్వాండో ప్రదర్శన నిర్వహించారు.

ఉపాధ్యాయుల పదోన్నతులకు కసరత్తు

- అభ్యంతరాల సవరణకు ప్రత్యేక కమిటీలు
- నేటితో ముగియనున్న పరిశీలనలు

కడప ఎడ్యుకేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో నమోదు చేసుకున్న వివరాల ఆధారంగా తాత్కాలిక సీనియారిటీ జాబితాలను ప్రకటించింది. ఇందులో అభ్యంతరాలుంటే ఈ నెల 10వ తేదీ లోగా ఫిర్యాదు చేసి సవరించుకోవాలని విద్యాశాఖ తెలిపింది. ఇందులో భాగంగానే గత మూడో తేదీ నుంచి ప్రతిరోజు సాయంత్రం మూడు నుంచి ఏడు గంటల వరకు ప్రత్యేక కమిటీలు పనిచేస్తూ ఉన్నాయి. వివరాలు పరిశీలిస్తే... జిల్లా స్థాయి కమిటీలో పాత జిల్లా కేంద్రం విద్యాశాఖ అధికారి చైర్మన్‌గా వ్యవహరిస్తూ పాత జిల్లా కేంద్ర ఏడీ మెంబర్ కన్వీనర్ గాను, కొత్త జిల్లా కేంద్రం ఏడీ, పాత కొత్త జిల్లాల సూపరింటెండెంట్లు సభ్యులుగా ఉంటూ కేడర్ వారీగా పరిశీలన కోసం ఉప విద్యాశాఖ అధికారి, డీసీఈబీ సెక్రటరీ, సీనియర్ హెడ్మాస్టర్ ప్రత్యేక కమిటీలుగా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఉపాధ్యాయుల అభ్యంతరాలను జిల్లా స్థాయి కమిటీలు అప్పటి కప్పుడే పరిష్కరిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాస్థాయి కమిటీ నిర్ణయాలపై అభ్యం తరాలు ఉంటే రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కు అప్పీల్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. జిల్లా ఫిర్యాదుల పరిష్కార కమిటీ ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈనెల 10వ తేదీ వరకు పని చేస్తుంది. తుది సాధారణ సీనియారిటీ జాబితా ఆధారంగా పదోన్నతి సీనియారిటీ జాబితాను తయారుచేస్తారు. సాధారణ సీనియారిటీ జాబితా డీఎస్సీలోని మెరిట్ ర్యాంకు ఆధారంగా, సబార్డినేట్ సర్వీస్ రూల్ 33 ప్రకారం తయారు చేస్తారు. పదోన్నతుల సీనియారిటీ జాబితా రోస్టర్ కం మెరిట్, అడక్వసీ ఆఫ్ ప్రమోషన్ రిజర్వేషన్స్ నిబంధనల మేరకు సబార్డినేట్ సర్వీస్ రూల్ 20ని ఆధారంచేసుకొని తుది రూపు తీసుకువస్తారు.

ర్యాంకుల జాబితా ప్రకటించాలి



ఇప్పటి వరకు జరిగిన అన్ని డీఎస్సీల బ్యాచ్‌లు, ఉపాధ్యాయుల వారీగా మెరిట్ ర్యాంకుల జాబితా ప్రకటించాలి. సీనియారిటీ జాబితాలో ఉపాధ్యాయులకు చెందిన ర్యాంకుల వివరాలు ఇచ్చినా, స్పష్టత కోసం డీఎస్సీ వారీ ర్యాంకుల జాబితా ప్రకటించాలి. రోస్టర్ ర్యాంకు, మెరిట్ ర్యాంకు వివరాలపై స్పష్టతను ఇవ్వాలి. ప్రతి ఉపాధ్యాయుడికి సంబంధించిన డీఎస్సీ మెరిట్ ర్యాంకుతో పాటు మార్కుల వివరాలు తెలపాలి. గతంలో మాదిరి పదోన్నతులు ఇచ్చే ఖాళీల సంఖ్యకు మూడు రెట్లు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను సంసిద్ధం చేసే మాదిరిగా ముందుకు సాగాలి. ఫైనల్ సీనియారిటీ జాబితాలు ఎటువంటి సమస్యలు లేకుండా ప్రకటించాలి.

- సి.వి ప్రసాద్, ఏపీటీఎఫ్, అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

సాధారణ తాత్కాలిక, సీనియారిటీ జాబితాలో తికమకలు

రాష్ట్ర ఆదేశాలను అనుసరిస్తూ జిల్లా విద్యాశాఖ సాధారణ తాత్కాలిక సీనియారిటీ జాబితాలను విడుదల చేసింది. వీటిని జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో కూడా ప్రచురించింది. దీనిపై అభ్యంతరాలశు తెలపాలంటూ ప్రకటనలు కూడా విడుదల చేసింది. సీనియారిటీ జాబితాను పరిశీలించిన మీదట టీఐ ఎస్‌లో కులాల కేటగిరీలు ఖచ్చితంగా నమోదు చేసిన కొంత మంది ఉపాధ్యాయుల పేర్లు తాత్కాలిక సీనియారిటీ జాబితాలో వేరుగా నమోదైనట్లు తెలుస్తోంది. డీఎస్సీల వారీగా ర్యాంకుల జాబితాలు అన్ని బ్యాచులకు అందుబాటులో లేకపోవడం వల్ల సీనియారిటీ నిర్ణయించడంలో కొన్ని ఇబ్బందులు చోటుచేసు కున్నాయి. కొన్ని డీఎస్సీల వారీ నియామక పత్రాలతో ర్యాంకును నమోదు చేయక పోవడంతో కూడా సమస్య ఉత్పన్నమవుతోంది. అదే మాదిరిగా ప్రతి డీఎస్సీకీ సంబంధించిన ఖచ్చితమైన రికార్డులు విద్యా శాఖ వద్ద లేకపోవడం చర్చనీ యాంశమైంది. గతంలో డీఎస్సీల రికార్డులన్నీ జిల్లా పరిషత్ ఆధీ నంలో ఉండడమే ఇందుకు ప్రధాన కారణంగా భావించాల్సి వస్తోంది. డీఈఓ ఆధీనంలో నిర్వహించిన డీఎస్సీల ఉపాధ్యాయు లకు నియామక పత్రాలలో ర్యాంకులను నమోదు చేసినా అది రోస్టర్ ర్యాంకా? మెరిట్ ర్యాంకా? అన్న దానిపై స్పష్టత లేదు. దీనితో సీనియారిటీ జాబితాలో ర్యాంకుల నమోదుపై పలు అభ్యంతరాలు వచ్చినట్లు తెలుస్తోంది. 1996 మూడవ బ్యాచ్‌కు అసలు ర్యాంకులే లేనందున ఉన్నత ర్యాంకు ఉన్నవారికి అన్యాయం జరిగే అవకాశం లేకపోలేదు. తుది సాధారణ సీనియారిటీ జాబితా ఆధారంగా పదోన్నతి సీనియారిటీ జాబితాను తయారు చేస్తారు. జిల్లా విద్యా అధికారి ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టుల పదోన్నతులకు, ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెడ్‌మాస్టర్ పోస్టులకు పదోన్నతులకు అధికారిగా ఉంటారు.



డీఈఓ కార్యాలయంలో అభ్యంతరాలను పరిశీలిస్తున్న అధికారులు

పదోన్నతులపై అనుమానాలు

పదోన్నతులపై ఉపాధ్యాయులకు పలు అనుమానాలున్నాయి. ప్రస్తుతం ఉన్న నిబంధనల మేరకు ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల మిగులు ఏర్పడుతున్న సందర్భంలో పదోన్నతులకు ఖాళీలు ఎక్కువున్నాయని చర్చలు సాగుతున్నాయి. మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే నిబంధనలు వెలువడిన తర్వాత మాత్రమే పదోన్నతులపై స్పష్టమైన వివరాలు అందే అవకాశం ఉంది. దీనిపై మెగా డీఎస్సీ కూడా ఆధారపడి ఉంటుందని తెలుస్తుంది. స్పష్టమైన సర్దుబాటు నిబంధనలు విడుదల చేయాలని కూడా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కామేశ్వరుడిని తాకిన భానుడి కిరణాలు



స్వామి పీఠంపై సూర్యకిరణాలు

వాల్మీకిపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటివీధిలో ఉన్న లక్ష్మీ కామేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం అభిషేక సమయంలో సూర్య కిరణాలు స్వామివారి పీఠాన్ని తాకాయి. ఈ దృశ్యాన్ని తిలకించిన భక్తులు పూజలు చేసి తన్మయం చెందారు. అర్చకుడు గోన వరప్రసాద్ శీనాస్వామి కామేశ్వరస్వామికి పూజలు చేశారు.

12న మల్లయ్యకొండ ఆలయ హుండీ లెక్కింపు

తంబళ్లపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి ఆలయ ప్రధాన హుండీలోని కానుకలను ఈ నెల 12న లెక్కించనున్నట్లు ఈవో మునిరాజ తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలు ముగిసిన మరుసటి రోజు (ఫిబ్రవరి 27)న తాత్కాలిక హుండీ , సేవా టికెట్లు, కల్యాణోత్సవం చదివింపులు, చందాల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.5,08,918లు ఆదాయం వచ్చింది. అదే రోజున నిర్వహించాల్సి ప్రధాన హుండీ లెక్కింపు అనివార్య కారణాలతో వాయిదా పడిందని ఈవో తెలిపారు.

11 మంది జూదరుల అరెస్టు

- రూ. 3.24లక్షలు స్వాధీనం
- కానిస్టేబుల్‌పై కేసు నమోదు
- మరికొందరు అధికారులపై అంతర్గత విచారణ

రాయచోటిటౌన్ మార్చి 9 (ఆంధ్రజ్యోతి:) జూదగృహంపై స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు నిర్వహించి 11 మందిని అదుపులోకి తీసుకుని రూ.3.24 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు ఈ జూదగృహం నిర్వహణలో రాయచోటి అర్బన్ పోలీసు స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ హస్తం ఉన్నట్లు సమాచారం. వివరాలిలా ఉన్నాయి. పట్టణ శివారులోని సుండుపల్లె మార్గంలో ఉన్న టిడ్కో ఇళ్లలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో.. జిల్లా స్థాయి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు చేసి, మోహన్ అనే వ్యక్తితోపాటు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైలవరం ప్రాంతాలకు చెందిన 10 మందిని అరెస్టు చేశారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు.. సదరు కానిస్టేబుల్‌పైనా కేసు నమోదు చేసినట్లు సమాచారం. జూదం ద్వారా సంపాదించే మొత్తంలో కొందరు పైస్థాయి అధికారులకు మామూళ్లు ఇస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. మామూళ్లు తీసుకుని.. జూదం నిర్వహించుకోవడానికి సహకరిస్తున్న ఆయా అధికారులపైనా ఉన్నతాధికారులు అంతర్గత విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ... 11 మంది జూదరులను అరెస్టు చేశామన్నారు. కానిస్టేబుల్‌పైన ఇంకా కేసు నమోదు చేయలేదని, విచారణ జరుగుతోందన్నారు. జూదం నిర్వహిస్తున్న కానిస్టేబుల్ తనకు మామూళ్లు ఇచ్చారనడం వాస్తవం కాదన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ.. కూలీలకు గాయాలు



సంఘటనా స్థలంలో లారీ, ఆటో

పులివెందుల టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆటోను లారీ ఢీకొనడంతో 12 మంది కూలీలకు గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం పట్టణ సమీపంలోని చిన్న రంగాపురం గ్రామం వద్ద గల ఫుడ్ అండ్ సైన్స్ కాలేజీ వద్ద అరటికాయల లోడుకు వెళుతున్న ఢిల్లీ లారీ కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటోలోని 12 మంది కూలీలు గాయపడ్డారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ నుంచి కూలి పని నిమిత్తం 12 మంది ఇప్పట్ల గ్రామానికి వెళుతుండగా చిన్నరంగాపురం వద్ద వెనక వైపు నుంచి వచ్చి లారీ ఢీకొంది. దీంతె ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న కంపచెట్లలో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 8 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ సీఐ ఎస్వీ రమణ, ట్రాఫిక్ సీఐ హాజీవలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.

మద్యం దుకాణంలో చోరీ..



సీసీ కెమెరాలకు చిక్కిన దుండగుడి చిత్రం

వాల్మీకిపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపర్తి గ్రామం రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ మద్యం దుకాణంలో శనివారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. దుకాణం తాళాలను పగులగొట్టి లోనికి చొరబడారు. రూ.33 వేలు, పలు మద్యం బాటిళ్లు అపహరించుకు పోయారు. ఉదయం దుకాణానికి వచ్చిన యజమాని శ్రీనివాసులు చోరీ విషయాన్ని గమనించి ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరా ఫుటేజీ సమర్పించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటిపై దాడి .. ఐదుగురిపై కేసు

వేంపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తన ఇంటిపై దాడి చేయడంతోపాటు ఫోన్‌లో దూషించారంటూ మండల కేంద్రంలోని సాయినగర్‌కు చెందిన భూమిరెడ్డి విజయభారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీటీసీ మాజీ సభ్యుడు జీవీ రమణ, భానుకిరణ్, శివతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. రెండు రోజుల క్రితం సాయినగర్‌లో భూమిరెడ్డి విజయభారతి ఉన్న ఇంటి వద్దకు వెళ్లి తలుపులను గట్టిగా తట్టారని, ఆమె భర్త శ్రీనాథ్‌రెడ్డికి ఫోన్ చేసి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, తనను శ్రీనాథ్ రెడ్డి ఫోన్‌లో బెదిరించడంతోపాటు, అసభ్య సందేశం పెట్టాడంటూ శివ కూడా ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్ రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కలసపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కిసిద్దుపల్లెలో కోనేటి సునీల్ (24) అనే యువకుడు ఆదివారం పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన వెంకట సుబ్బయ్య కుమారుడు సునీల్ ఇటీవలే వరికోతయంత్రం కొనుగోలు చేశాడు. అయితే, దాని విషయం పట్టించుకోకుండా ఎక్కువ సమయం సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ కాలం గడుపుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కలసపాడు ఎస్ఐ మద్దిలేటి తెలిపారు.

నేడే చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

- సినీ నటి కీర్తి సురేష్ రాక



కడప (మారుతీనగర్), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ మెయిన్‌గేట్ ఎదురుగా సోమవారం చెన్నయ్ షాపింగ్ మాల్ 29వ బ్రాంచ్ ప్రారంభం కానుంది. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలో విస్తరించిన చెన్నయ్ షాపింగ్‌మాల్ కడప నగరవాసులకు నేటి నుంచి పరిచయం కానుంది. నాణ్యమైన దుస్తులు, లేడీస్ ఫ్యాన్సీ ఐటమ్స్ అందించేందుకు షాపింగ్‌మాల్ సిద్ధమైంది. ప్రముఖ సినీ హీరోయిన్ కీర్తి సురేష్ సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నారు. కడప జిల్లాతో పాటు అన్నమయ్య జిల్లాలో ఉన్న ప్రజలు చెన్నయ్ షాపింగ్ మాల్ కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో తిరుపతికి వెళ్లి కొనుగోలు చేసే వారు. నేడు కడప నగరానికి చెన్నయ్ షాపింగ్ మాల్ రావడంతో ప్రజలు మాల్ ప్రారంభం కోసం ఆసక్తిగా చూస్తున్నారు. మాల్ ప్రారంభం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. మాల్‌లో రూ.99కే మహిళలకు చీరలు దొరుకుతాయని ప్రచారం చేయడంతో ప్రజలు ఎక్కువ సంఖ్యలో వచ్చి మొదటిరోజు షాపును సందర్శించే అవకాశం ఉంది.

గంగమ్మ తల్లికి ఘనంగా పూజలు



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

సీకేదిన్నె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతర మొదటి ఆదివారం సందర్భంగా భక్తులు అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. భక్తులు ఆలయ పరిసరాల్లో మొక్కులు తీర్చుకుని బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు ఏర్పాటు చేసుకుని ఆనందంగా గడిపారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణోత్సవం

రామసముద్రం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మట్లవారిపల్లెలో ఆదివారం ఉజ్జనేశ్వర, శిగరేశ్వర, బీరేశ్వర, బత్తేశ్వర శివాలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు, అభిషేకాలు చేశారు. ° ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడుకు చెందిన కురబ కుల భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పొలిమేరల్లో టెంట్లు ఏర్పాటు చేసి అన్నదానం చేశారు. ప్రతి 14 ఏళ్లకు ఒకసారి కురబ సంఘాల ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవాలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. వందల సంఖ్యలో కార్లు, టెంపోలు, ద్విచక్ర వాహనాలు రావడంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. దీంతో రామసముద్రం-మదనపల్లె వెళ్లే బస్సులను ఆర్.నడింపల్లె, చెంబకూరు మీదుగా మళ్లించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పూజలు చేయించారు.

చదువులమ్మ చెట్టు నీడలో..

- ఆరు పదుల వయసులో ఆత్మీయ సమావేశం
- కోవరంగుట్టపల్లిలో పూర్వ విద్యార్థుల కలయిక



కోవరంగుట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో 1974-75లో పదవ తరగతి చదివిన విద్యార్థులు

సింహాద్రిపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వారంతా ఆరు పదుల వయసు దాటిన వారు. యాభై ఏళ్లప్పుడు పదో తరగతి చదివారు. ఇన్నేళ్ల తర్వాత అందరూ కలసి తాము చదువుకున్న కోవరంగుట్టపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం కలిశారు. 1974-75 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన 37 మంది ఆ విద్యార్థులు అప్పటి సంఘటనలు నెమరువేసుకున్నారు, కుటుంబ నేపథ్యం తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ రోజు ఎన్నటికీ మరువలేమని చిన్ననాటి స్నేహితులను మళ్లీ కలుసు కుంటామని కలలో కూడా ఊహించలేదని పలువురు మాట్లాడారు. గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. రిటైర్డ్ హెచ్ఎం రామలింగారెడ్డిని తుమ్మల పల్లి సూరుడు సన్మానించారు. పూర్వ విద్యార్థి రిటైర్డ్ రైల్వే ఉద్యోగి మధుసూదనశాస్త్రి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పాఠశాల స్థలదాత వారసుడు మండల మాజీ ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్‌రెడ్డి, మానవతా సేవా సమితి అధ్యక్షుడు కొండారెడ్డి, పాఠశాల హెచ్ఎం రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ పీడీ చంద్రశేఖర్‌రెడ్డి పాఠశాలకు రూ.20 వేలు విలువ చేసే మైక్ సెట్‌ను అందజేశారు.

ప్రాణాలు బలిగొన్న రహదారులు

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

అన్నమయ్య జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, ఒకరు గాయాలపాలయ్యారు.



ఓబులవారిపల్లె : సంఘటనా స్థలంలో యువకుడి మృతదేహం

ఓబులవారిపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట మండలం అప్పయ్యరాజుపేట పంచాయతీ పెరియవరం గ్రామానికి చెందిన అంది వెంకటేశ్(26) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న తన మేనల్లుడు విజయ్‌ను చూడడానికి ఆదివారం బైక్‌పై కొర్లకుంటకు వచ్చాడు. స్కూల్లో అనుమతి తీసుకుని తన అల్లుడితోపాటు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా బొమ్మవరం క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చొన్న అతని అల్లుడు విజయ్ గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అందుబాటులో లేకపోవడం తిరుపతికి తీసుకెళ్లారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఓబులవారిపల్లె ఎస్ఐ మహేష్ ఘటన స్థలానికి చేరుకుని మృతుడి బంధువులకు సమాచారాన్ని అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాలుడు విజయ్

విద్యార్థి దుర్మరణం...

మదనపల్లె అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మదనపల్లె పట్టణం, శివాజీ నగర్‌కు చెందిన శ్రీనివాసులు కుమారుడు ఉదయ్‌కిరణ్(20) శనివారం రాత్రి పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి మిత్రులతో కలసి వెళ్లాడు. కార్యక్రమం అనంతరం బైక్‌పై తిరిగి వస్తూ కనుమలో గంగమ్మ ఆలయం వద్ద రోడ్డు పక్కనే ఉన్న బంకును ఢీకొని గాయపడ్డాడు. స్థానికులు అతనిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.. పోస్టుమార్టం అనంతరం ఆదివారం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

యువతను నమ్మించి మోసగించడం భావ్యమా?

వేంపల్లె,మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతను నమ్మించి మోసగించడం భావ్యమా అని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ముఖ్యమంత్రిని సూటిగా ప్రశ్నించారు. ఆదివారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన హామీ నిరుద్యోగ భృతి అన్నారు. కూటమి అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు చొప్పున తమ ప్రభుత్వం ఇస్తుందని సూపర్‌సిక్స్ హామీలలో పేర్కొన్నారన్నారు. దాదాపు 20 లక్షల మంది నిరుద్యోగులకు ఏడాదికి దాదాపు రూ.7200 కోట్లు విడుదల చేయాలన్నారు. కానీ 2024-25 బడ్జెట్‌లో, 2025-26 బడ్జెట్‌లలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. వచ్చే ఏప్రిల్ నుంచి అయిన నిరుద్యోగ భృతిని అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

జ్యోతి దేవాలయంలో పురాతన శాసనం



జ్యోతి సిద్దేశ్వర ఆలయ ప్రాంగణంలో గుర్తించిన శాసనం

సిద్దవటం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్యోతి గ్రామంలో ఉన్న జ్యోతిలింగేశ్వర, సిద్దేశ్వ స్వామి దేవాలయానికి దక్షిణంగా ఉన్న మండపం అడుగు భాగాన మరో శాసనం వెలుగులోకి వచ్చింది. ఫిబ్రవరి 26న మహా శివరాత్రి సందర్భంగా దక్షిణ భారత పర్యాటక సంస్థ జిల్లా అధ్య క్షుడు జ్యోతి జార్జి, ప్రధాన కార్యదర్శి మురికినాటి శ్రీనివాసులు ఇక్కడున్న శివలింగాలను, మండపాన్ని సందర్శించారు. ఈ క్రమంలో మండపం ఫ్లో రింగుపై శాసనాన్ని కనుగొన్నారు. దీనిని ఫొటో తీసి బెంగుళూరు మైసూరు లో ఉన్న భారత పురావస్తుశాఖ డైరెక్టర్ డాక్టర్ కె.మునిరత్నంరెడ్డికి పంపగా ఆయన పరిశీలించారని వారు తెలియజేశారు. ఇలాంటి ప్రాచీన చరిత్ర కలిగిన శాసనాలకు రక్షణ కల్పించాలని కోరారు.

కడప ఉక్కు సాధన ఉద్యమానికి సన్నద్ధం కావాలి

కడప సెవెన్ రోడ్స్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు మరోమారు ఉద్యమానికి సన్నద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల రూ.3.22లక్షలకోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 50,65,345 బడ్జెట్‌లో కడప ఉక్కు ఫ్యాక్టరీ ప్రస్తావనే చేయక పోవడం సర్కారు దగాకోరుతనాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ఈ సమావేంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.వేణుగోపాల్, కేసీ బాదుల్లా పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయండి



జనసేన ఆవిర్భావ సన్నాహక సమావేశంలో పాల్గొన్న తాతంశెట్టి నాగేంద్ర, తుంగా రమణయ్య తదితరులు, ర్యాలీలో పాల్గొన్న తుంగా రమణయ్య

కడప మారుతీనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో ఈనెల 14న జరుగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ, విజయోత్సవ సభను దిగ్విజయం చేసేందుకు జిల్లా నుంచి జనసేన కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని ఆపార్టీ సమన్వయకర్త, జిల్లా కో-ఆర్డినేటర్ తాతంశెట్టి నాగేంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం దేవునికడపలోని కళ్యాణమండపంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సన్నాహక సమావేశం జరిగింది. సభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై తొలుత చలో పిఠాపురం పోస్టర్లను ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. అనంతరం జనసేన నాయకుడు తుంగా రమణయ్య మాట్లాడుతూ పిఠాపురం సభకు తరలి వచ్చే కార్యకర్తలు, నాయకులకు తోడ్పాటు అందిస్తున్న తాతంశెట్టి నాగేంద్రకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికలలో కడప కార్పొరేషన్ బరిలో జనసేనపార్టీ తరఫున పోటీచేసేందుకు సిద్ధంగా వున్నామన్నారు.

నగరంలో బైక్ ర్యాలీ..: సభా కార్యక్రమానికి ముందుగా పిఠాపురం సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ హలో కడప...చలో పిఠాపురం పేరుతో నగర సంధ్య సర్కిల్ నుంచి పెద్ద ఎత్తున దేవుని కడప సభ జరిగే కళ్యాణమండపం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాలే శివ, వెంకటరమణ, రంజిత్‌కుమార్,తో పాటుగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



చెన్నూరు శివాలయంవీధి (తగ్గుప్రాంతం)లో ఉన్న అంగన్వాడీ కేంద్రానికి వెనక వైపు పునాది దెబ్బతింది. చాలాకాలంగా ఈ భవనం వెనుక వైపున పునాది సుమారు 8 అడుగుల మేర దెబ్బతినడంతో దీని ప్రభావం ఫ్లోరింగ్‌పై పడుతుంది. దెబ్బతిన్న పునాది ప్రాంతంలో లోపలికి గుంత మాదిరి చొచ్చుకుని పోవడం, ఎప్పుడైనా పక్కనే ఉన్న పెన్నానది పొంగినప్పుడు ఈ అంగన్వాడీ కేంద్రం వరకు నీళ్ల వస్తాయి. అప్పుడు దెబ్బతిన్న పునాది వల్ల అంగన్వాడీ కేంద్రానికి ప్రమాదం కలిగే అవకాశం ఉంది. ఐసీడీఎస్ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. లేకుంటే అందులో చదివే చిన్నారులకు ప్రమాదం జరిగే పరిస్థితి ఉంది.

చెన్నూరు (ఆంధ్రజ్యోతి)

సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి

కడప సెవెన్ రోడ్స్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ, సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి కోరారు. ఆదివారం ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూని యన్ ఐటీయూసీ అనుబంధం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో కడప నగరంలోని ఏఐటీయూసీ ఆఫీసులో మార్చి 28న చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐటీ యూసీ నగర అధ్యక్షుడు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కడపక్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సాగర్‌కాలనీకి చెందిన ఓ మహిళ తలకు పూసుకునే రంగు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. రిమ్స్ పోలీసుల వివరాల మేరకు.. కడప సాగర్‌కాలనీకి చెందిన షేక్ యాస్మిన్ (32) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. చిన్న చిన్న అప్పుల విషయమై తీవ్ర మనస్థాపం చెంది ఈ నెల 5న తలకు పూసుకునే రంగు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. భర్త ఖాదర్‌బాషా గుర్తించి ఆమెను రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమా ర్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేశామని వారు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 33/11 కేవీ కోతిసమాధి సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ పార్నపల్లి రోడ్డు,11కేవీ రాజీవ్‌నగర్ ఫీడరు మరమ్మతులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంద న్నారు.

బియ్యం ప్యాకెట్ల వితరణ

కడప సెవెన్ రోడ్స్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ముస్లింల పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లిం పేదలకు ఆంధ్రా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బియ్యం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆదివారం కడప నంగరంలోని మద్రాస్ రోడ్డులో గల ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఈ బియ్యం ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు లయన్ పటాన్ ఖాదర్‌బాష పాల్గొన్నారు.

లేబర్ కార్డులు ఇవ్వాలి

చెన్నూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అసంఘటిత భవన నిర్మాణ కార్మికులందరికీ లేబర్ కార్డులు ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక శక్తి పోరాట యూనియన్ అధ్యక్షుడు ఓబులేసు అన్నారు. చెన్నూరు బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం సాయంత్రం మండల వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పనులు చేసుకుంటున్న రోజువారి కూలి పట్ల గత ప్రభుత్వంలో లేబర్ కార్డులు ఇవ్వలేదని, ఈ ప్రభుత్వంలో అయినా వారందరికీ లేబర్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు శివన్న, సుబ్బరాయుడు, దొరస్వామి, దర్గయ్య, రామనపల్లె గంగయ్య, జయన్న, అస్లాం, సాదిక్, మహ్మద్ ఆలీ పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలను పరిరక్షించాలి

కడప ఎడ్యుకేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యానికి ముందు నుంచి రాష్ట్రంలో ఉర్దూ పాఠశాలలు ఉన్నాయని వాటిని పరిరక్షించి, అభివృద్ధి పరిచే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఎంతైనా ఉందని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) ఉర్దూ పాఠశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్లు ఎ.ఇస్మాయిల్, సయ్యద్ రహమతుల్లా, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ ఖాన్ సలీం ఖాన్ ప్రకటనలో కోరారు. రాష్ట్రంలోని మైనర్ మీడియా ఉర్దూ, తమిళం, కన్నడ,ఒరియా పాఠశాలల అభివృద్ధికై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు.రాబోయే మెగా డీఎస్సీలో ఉర్దూ పాఠశాలల ఉపాధ్యాయ ఖాళీలన్నీ భర్తీచేయాలన్నారు.

సీబీఆర్ ప్రాజెక్టు మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలి

లింగాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె సమీపంలో ఉన్న సీబీఆర్ ప్రాజెక్టు మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం సీబీఆర్ ప్రాజెక్టును సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు మట్టి కట్ట రివిట్‌మెంట్ కుంగిందని,రక్షణ గోడ మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అధికారులు రూ.14కోట్లతో ప్రతిపాదనలు పంపిన నిధులు మంజూరు కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అయిన నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి



ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

వేంపల్లె,మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని నూతన అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. వేంపల్లె అమ్మవారిశాలలో నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. గౌరవాధ్యక్షుడు రాయవరం సురేంద్ర, ఉపాధ్యక్షులు దొంతు సుబ్బారావు, నారాయణ సుబ్రమణ్యం, కార్యదర్శిగా కాంబోజి సత్యనారాయణ, యువజన సంఘం అధ్యక్షుడుగా రాయవరం సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా దొంతు నిరంజన్, వీరేంద్రనాథ్, వంశీ, కార్యదర్శిగా సతీష్, వాసవీ కల్యాణ మండపం అధ్యక్షుడుగా కామిశెట్టి సతీష్, మహిళా మండలి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బచ్చు నాగేశ్వరమ్మ, నిచ్చనమెట్ల మాధవి తదితర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

పరామర్శ

కడప సెవెన్ రోడ్స్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల క్రితం అల్లరమూక దాడిలో గాయపడి, కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 39వ డివిజన్ సంబంధించిన వైసీపీ నాయకులు ఖాదర్ బాషను అంజాద్‌బాష పరామర్శించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్పొరేటర్ మహమ్మద్ షఫి, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వీరపునాయునిపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వర ఉన్నత పాఠశాలలో 1998-99 10వ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. అలనాటి తీపి జ్ఞాపకాలు, చిలిపిచేష్టలను గుర్తుకు తెచ్చుకొని సంతోషంగా గడిపారు. 25ఏళ్ల తర్వాత వచ్చిన విద్యార్థులు పాఠశాలను, తరగతి గదులకు వెళ్లి కలియతిరిగారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా సంగమేశ్వర విద్యాసంస్థల అధినేత ఒంటిగారి వెంకటసుబ్బానాయుడును పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.



1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

వల్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మాచిరెడ్డిపల్లెలో పుత్తా నరసింహారెడ్డి కుటుంబీకుల చే ప్రతిష్ఠింపబడిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన 29వ వార్షికోత్సవ వేడుకలు నేటి నుంచి ఐదురోజులపాటు నిర్వహించబడుతుందని కార్యనిర్వాహకులు మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి , ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. అంతరించిపోతున్న గ్రామీణ క్రీడలను కూడా ప్రోత్సహించి వారికి నగదు పారితోషికం అందిస్తున్నామన్నారు.

అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరు


కడప సెవెన్ రోడ్స్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం హోచిమన్ భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ చలో విజయవాడకు తరలివెళ్తున్న నాయకులను, కార్యకర్తలను, ఆయాలను ప్రభుత్వం పోలీసుల చేత అరెస్టు చేయించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌కు రంగనాథస్వామి నేమ్‌బోర్డు ఏర్పాటు



పులివెందుల టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పులివెందుల శ్రీరంగనాథస్వామి ఆలయ సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్‌కు శ్రీరంగనాథస్వామి నామఫలకాన్ని మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. గతంలో ఈ నామఫలకం స్థానంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ పేరును పెట్టడం జరిగింది. దీంతో టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ హిందూ సంఘం నాయకులు నిరసన, ధర్నా చేశారు. దీంతో మారిన ప్రభుత్వం నేపథ్యంలో టీడీపీ నాయకుడు రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదన్‌రెడ్డి ఈ అంశాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. మొత్తానికి పులివెందుల కూరగాయల మార్కెట్ పేరును మారుస్తూ మున్సిపల్ కమిషనరు రాముడు బోర్డును నూతనంగా ఏర్పాటు చేయించారు.

ఎమ్మెల్సీ అవకాశాన్ని దూదేకులకు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నరాజా

కడప మారుతీనగర్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): శాసనమండలికి జరుగుతున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో దూదేకుల వర్గీయులకు అవకాశం కల్పించాలని జిల్లా దూదేకుల (నూర్‌బాష్) సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరాజా, రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కమాల్‌బాష, జిల్లా నాయకులు అభినందన బాష తదితరులు సీఎం చంద్రబాబు నాయుడును కోరారు. ఆదివారం స్థానిక ఎర్రముక్కపల్లెలో గల నూర్‌బాష్ దూదేకుల భవనంలో ఆ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి సర్కార్ అధికారంలోకి రావడానికి ఓట్లు వేసి గెలిపించడం జరిగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా గౌరవ సలహాదారులు ఓబులేసు, కే.పీ.హుస్సేన్, నాయకులు కుళాయప్ప, ఖాదరయ్య, జి. బాబయ్య, సుభాన్, కిరణ్‌కుమార్, మస్తాన్, అజంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

యువత పోరు పోస్టర్లు విడుదల

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కార్యాలయంలో ఆదివారం యువత పోరు పోస్టర్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష, ఎమ్మెల్యే సుధా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేని పరిస్థితి ఉందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పించాలని డిమాండ్‌తో ఈనెల 12వ తేదీన యువత పోరు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో ఎమ్మెల్యే మాధవిరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాధవి తెలిపారు. ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఇంపాక్ట్ లైన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆరోగ్య శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వల్లి చిరుధాన్యాలకు సంబంధించి పూర్తి అవగాహన కల్పించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఇంటెక్ కన్వీనర్ చిన్నపరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, లైన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీరసుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రతేది'

కడప సెవెన్ రోడ్స్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య ఒక ప్రకటనలో మండిపడ్డారు. మగవారు ఇంటిలో లేని సమయంలో మహిళలు, పసిపిల్లలు ఉన్న ఇంటిపై వేంపల్లె టీడీపీ నాయకుడు జీవీ రమణ, అతని అనుచరులు మారణాయుధాలు, పెట్రోల్‌తో దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. ఈ సంఘటనపై హోంమంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్య సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు భూమిరెడ్డి విజయభారతికి సీపీఐ అండగా ఉంటుందని తెలిపారు.

ఇన్‌పుట్ డీలర్లు స్టాక్ పట్టిక ప్రదర్శించాలి

సికేదిన్నె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇన్‌పుట్ డీలర్లు షాపులో ఉండే స్టాక్‌ను పట్టికరూపంలో ప్రదర్శించాలని ఏడీఏ నాగరాజు తెలిపారు. స్థానిక ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రైవేటు ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అమ్మకాలు, నిలువల్లో సంబంధిత చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి రైతు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు ఇవ్వాలని గరిష్ఠ అమ్మకపు ధరకు లోబడి చట్టబద్ధమైన వ్యాపారం చేయాలని రికార్డులు సక్రమంగా మెయింటినెన్స్ చేయాలని, లైసెన్సును షాపులో రైతులు చూసేలా ప్రదర్శించాలన్నారు. నిషేధిత పురుగు మందులు, గడువు ముగిసిన పురుగు మందులను అమ్మరాదని అది చట్టరీత్యా నేరమన్నారు.

మున్సిపల్ ఏఈగా తిరువెంగళప్ప నియామకం

కమలాపురం రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీరుగా తిరువెంగళప్పను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని నగర పంచాయతీ కమిషనర్ పగడాల జగన్నాథం తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ అసిస్టెంట్ ఇంజనీరుగా పనిచేస్తున్న డి.సురేశ్ పదోన్నతిపై డీఈగా పలమనేరుకు బదిలీగా వెళ్లడంతో ఆ స్థానం ఖాళీగా ఉన్నదన్నారు. ప్రస్తుతం ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో అమెనిటీస్ సెక్రటరీగా పనిచేస్తూ కమలాపురంలో జరుగుతున్న పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ పనులను పర్యవేక్షిస్తున్న ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ ఇంజనీరు తిరువెంగళప్పను డిప్యుటేషన్ పద్ధతిపై అదనపు బాధ్యతపై మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీరుగా కమలాపురం నగర పంచయతీకి నియమిస్తూ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీరింగ్ పబ్లిక్ హెల్త్ అనంతపురం వారు ఉత్తర్వులు జారీ చేశారు.

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కడప మారుతీనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు (2024)ను వెంటనే రద్దు చేయాలని ముస్లిం మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బాబూ భాయ్ డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కడప జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నగర రవీంద్రనగర్ యు.ఎస్ మహల్ నుంచి 7 రోడ్లు వరకూ ర్యాలీగా చేరుకుని నిరసన చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గాలిచంద్ర, కాంగ్రెస్‌పార్టీ నాయకులు అఫ్జల్‌ఖాన్, మొహమ్మద్ అలీఖాన్, నాయకులు ముష్తి రహిముల్లా ఖాన్‌సాహెబ్, సీపీఎం నాయకులు చంద్రశేఖర్ ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

14 నుంచి ఉరుసు ఉత్సవాలు

పెండ్లిమర్రి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):ఈనెల 14వ తేది నుంచి మొయిళ్ళకాల్వ గ్రామంలో వెలసిన హజరత్ హుస్సేన్ వల్లి ఉరుసు,నారాయణస్వామి ఆరాధన ఉత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి.మొదటి రోజు పూల చాందిని, సాసవుల చిన్నమ్మ కథ,అన్నదానం, బండలాగుడు పోటీలు,కోలాటం,ఇతర కార్యక్రమాలు ఉంటాయి.

సన్ననిమ్మ రైతుల ఆశలు నెరవేరేనా..?



పెండ్లిమర్రి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సన్ననిమ్మ సాగు చేసిన రైతులు ప్రతి ఏడాది వేసవికాలం రాకకోసం ఎదురు చూస్తూంటారు.ఈ వేసవిలోనైనా నిమ్మకాయలకు ధర వచ్చి తమ ఆశలు నెర వేరుతాయని, అప్పుల కష్టాలు తీరుతాయని వేచి చూస్తుంటారు.మండలంలో దాదాపు 8000 ఎకరాలు రైతులు పంటలు సాగుచేస్తుంటే అందులో సింహభాగం సన్ననిమ్మదే.3000 నుంచి 3500 ఎకరాల్లో ఈ పంట సాగులో ఉంది.ప్రస్తుతం 800 కాయల మూట ధర 2000 రూపాయల వరకు ఉంది.ఈ ధర ఇలానే కొనసాగితే రైతు ఆశలు నెరవేరినట్లే.ఎకరాకు సాగుపెట్టుబడి 30వేల నుంచి 40 వేల రూపాయలవరకు వస్తుంది.రేటు బాగా వుంటే ఎకరాకు ఖర్చులు పోను 2లక్షల వరకు రైతుకు ఆదాయం వస్తుంది. కాయలనుఇక్కడ నుంచి బెంగళూరు,సేలం,చెన్నై,వేలూరు నగరాలకు పంపుతారు. ఒక్కసారి నిమ్మచెట్లను నాటితే 15 సంవత్సరాల వరకు పంట ఉంటుంది.3నుంచి4 సంవత్సరాలలోపు నిమ్మచెట్లు కాయలు కాయడం మొదలవుతుంది.అయితే ఈ వేసవికాలం పై రైతులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు.ఏమవుతుందో కాలమే నిర్ణయించాలి.

కలిసి వచ్చిన పసుపు పంట

- జోరుగా పసుపు తవ్వకాలు
- దువ్వూరులో దిగుబడులు మిశ్రమం
- రాజుపాళెంలో ఆశాజనకం
- పర్వాలేదనిపిస్తున్న వట్టి పసుపు ధరలు
- కష్టాలు తీరుతాయంటున్న రైతన్నలు



దువ్వూరులో ఉడకబెట్టి ఆరబోసిన వట్టి పసుపు



రాజుపాళెంలో కుప్పగా పోసిన పసుపు కొమ్ములు

దువ్వూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పచ్చ బంగారంగా పిలిచే పసుపు పంట ప్రస్తుత ఏడాది రైతన్నకు కలిసివచ్చింది. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికందుతుండడంతో సాగు చేసిన రైతుల్లో ఉత్సాహం కనపడుతుంది. వట్టి పసుపు ధరలు ఒకింత పర్వాలేదనిపించడమే ఇందుకు కారణం. దీంతో పంట తవ్వకాలు ఊపందుకున్నాయి. దువ్వూరు మండలంతోపాటు మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, బ్రహ్మంగారిమఠం ప్రాంతాల్లో రైతులు పసుపును విస్తృతంగా సాగు చేశారు. నియోజకవర్గ పరిధిలో మైదుకూరు ప్రాంతంలో అధికంగా 1011 ఎకరాల్లో పసుపు పంట సాగైంది. వ్యవసాయాధికారుల లెక్కల మేరకు దువ్వూరు మండలంలో 582 ఎకరాల్లో, ఖాజీపేట ప్రాంతంలో 408 ఎకరాల్లో, చాపాడు మండలంలో 350 ఎకరాలకుపైగా, బి.మఠం మండలంలో 50కిపైగా ఎకరాల్లో ఈ పంట పెట్టినట్లు తెలుస్తోంది. మొత్తంగా నియోజకవర్గ పరిధిలో 2,400 ఎకరాలకుపైగా సాగైంది. ఒక ఎకరాలో ఈ పంట సాగుకు రూ.1.30 లక్షల దాకా పెట్టుబడుల కింద వెచ్చించారు.

వెంటాడిన తెగుళ్లు

పసుపు పంటను ఈ యేడు తెగుళ్లు అధికంగా సోకాయి. మొదట పైరు బాగా కనిపించినా పెరిగేకొద్ది దుంపకుళ్లు సోకింది. చాలా మంది రైతుల పొలాల్లో తెగుళ్ల ప్రభావంతో దిగుబడి తగ్గింది. ఉండకొమ్ముకు చుట్టిన రెమ్మలు పుచ్చు పట్టి దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి తగ్గింది

పర్వాలేదనిపిస్తున్న ధరలు

మార్కెట్‌లో వట్టి పసుపు క్వింటా రూ.9,500 పలుకుతోంది. నిరుడు గరిష్ఠంగా క్వింటాలు వట్టి పసుపు 1500 వేలు పైబడి ధర పలికింది. ప్రస్తుతం రూ.9,300 ధర ఉంది. అయితే కొత్త పసుపు ధర పెరుగుతుందనే ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతోంది.

రాజుపాళెంలో ఆశాజనకంగా పసుపు

రాజుపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నకు ఈ సంవత్సరం పసుపు పంట పండింది. దిగుబడి పెరగడంతో కొన్నేళ్లుగా నష్టాలతో కష్టాలు పడుతున్న రైతన్నలు ప్రస్తుతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి రావడంతో పాటు మార్కెట్లో కూడా క్వింటాలు రూ10 వేలు ధర పలుకుతుండడంతో రైతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మండల పరిధిలోని కేసీ కెనాల్ కింద దాదాపు 200 ఎకరాలకు పైబడి ఈ పంట సాగులో ఉంది. ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి రావడంతో ఎకరాకు రూ.30 నుంచి రూ40వేలు మిగులు తుందని రైతులు అంటున్నారు. దిగుబడితో పాటు క్వింటా రూ. 15వేల నుంచి రూ.20వేల వరకు అమ్మితే మంచి లాభాలు వస్తాయని రైతన్నలు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా పసుపు పంట రైతన్నలకు ఊరట లభించింది.

ఈ ఏడాది పసుపు కలిసి వచ్చింది



కౌలుకు సాగు చేసి ఎకరా పసుపు సాగు చేశాను. అయి తే ఎకూకు 20 నుంచి 25 క్వింటాళ్లదిగుబడి వ స్తుండడంతో అన్ని ఖర్చులు పోను 20 వేల నుంచి 30వే లు మిగులనుంది. ఈ ఏడా దే కొంచెం మేలుగా ఉందని గత ఐదేళ్ల నుంచి పసుపు సాగు లో తీవ్రంగా నష్టపోయామన్నారు. మరింత రేటు వచ్చే విధంగా మార్క్‌ఫెడ్ ద్వారా కొను గోలు చేస్తే రైతన్నకు మరింత మేలు జరుగు తుందన్నారు.

-నాగరాజు, రైతు, రాజుపాళెం

అంగన్‌వాడీ వర్కర్లను అడ్డుకున్న పోలీసులు



కొండాపురం రైల్వే స్టేషన్ వద్ద విజయవాడకు వెళుతున్న అంగన్‌వాడీలను అడ్డుకున్న పోలీసులు

కొండాపురం, మార్చి 9 (ఆంధ్ర జ్యోతి:) అంగన్‌వాడీ వర్కర్లు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లవద్దంటూ పోలీసులు నోటీసులు ఇచ్చినా లెక్కచేయకపోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. మండ లంలో యాక్టివ్‌గా ఉండే యూనియన్ నేతలకు పోలీసులు ఇళ్ల వద్దకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. అయినా కొంతమంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలుకు, మరికొంత మంది బస్సుల్లో విజయవాడకు తరలివెళుతుండగా వారిని అడ్డుకున్నారు. జీతాలు పెంచాలని తమ సమస్యలు పరిష్కరించాలని చలో విజయవాడ కార్యక్రమం తలపెడితే ప్రభుత్వం తమను అడ్డుకోవడం అన్యాయమని ఈ సందర్భంగా పలువురు యూనియన్ నేతలు పేర్కొన్నారు.



మైదుకూరులో పోలీసుల అదుపులో అంగన్‌వాడీ టీచర్లు

మైదుకూరు రూరల్‌లో : అంగన్‌వాడీల జీతాలు పెంచాలంటు చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న అంగన్‌వాడీ టీచర్లను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. దీనిపై ఎస్‌ఐ చిరంజీవి మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమానికి అనుమతుల లేవని అందుకే వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్ కు తీసుకొచ్చిట్లు ఆయన తెలిపారు.



ఎర్రగుంట్లలో సీఐతో వాగ్వాదం చేస్తున్న అంగన్‌వాడీలు

ఎర్రగుంట్లలో: తమ హక్కుల కోసం పోరాటం చేసేందుకు నిర్వహిస్తున్న మహాధర్నాను అడ్డుకోవడం దారుణమని అంగన్వాడీ రాష్ట్ర నాయకురాలు మంజుల పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఎర్రగుంట్లలో రైల్వేస్టేషన్‌లో ధర్నాకు వస్తున్న అంగన్వాడీల పట్ల పోలీసుల ప్రవర్తన అభ్యంతరకరమన్నారు. మహా ధర్నాకు రైళ్లలో, బస్సుల్లో వస్తున్న అంగన్వాడీలను అర్ధరాత్రి అరెస్టులు చేయడం అమానవీయమన్నారు. రైల్వేస్టేషన్‌లో అరెస్టులు చేసిన అంగన్వాడీలు పోలీసు లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మంత్రి నాదెండ్లను కలిసిన జనసేన నేత మల్హోత్ర



మైదుకూరు రూరల్ , మార్చి9(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ 12 వ ఆవిర్భవ సభను పురస్కరించుకొని ఆదివారం మైదుకూరు జనసేన నియోజకవర్గ బాధ్యుడు పందిటి మల్హోత్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిశారు. అనంతరం నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులను ఆయన మంత్రికి వివరించారు.

నూతన ఎన్‌జీఓ మహిళ కార్యవర్గం ఎన్నిక



మైదుకూరు రూరల్ ,మార్చి9(ఆంధ్రజ్యోతి) : మండల ఎన్‌జీఓ అధ్యక్షుడు చంద్రమౌళి, కార్యదర్శి రాఘవయ్యల ఆధ్వర్యంలో ఆదివారం నూతన మహిళ ఎన్‌జీఓ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మైదుకూరు తాలుకా మహిళ చైర్‌పర్సన్‌గా టీఎం సువర్ణ, కన్వీనర్ గా సుజాత, ఉపాధ్యక్షురాలుగా ఉమా, గౌరవ అధ్యక్షుడుగా డాక్టర్ మల్లేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

ఇద్దరు క్రికెట్ బుకీల అరెస్టు

ప్రొద్దుటూరు , మార్చి 9 (ఆంధ్రజ్యోతి) :ప్రొద్దుటూరు త్రీటౌన్ పరిధిలో ఇద్దరు క్రికెట్ బుకీలను ఆదివారం అరెస్టు చేసినట్లు త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.46,400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అరెస్టు అయిన వారిలో బొల్లవరానికి చెందిన మునికుమార్‌తోపాటు మరొక వ్యక్తిని ఉన్నారన్నారు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోండి



నృత్యం చేస్తున్న చిన్నారులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జీవన జ్యోతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు గురుదేవ్‌రామిరెడ్డి, కరస్పాండెంట్ అమర్‌నాథ్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం హోమస్‌పేటలోని జీవనజ్యోతి పాఠశాల వార్షికోత్సవ వేడుకలు బాలాజీ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉన్నత విద్య అభ్యసించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. కష్టపడి చదివి తమ కలలను నెరవేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ఎర్రగుంట్ల, మార్చి 9 (ఆంధ్ర జ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఎర్రగుంట్ల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రొ ద్దుటూరు అభిలాష్ కంటి సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి వైద్యులు వైద్య శిబిరంలో 84 మంది పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్ కొరకు ప్రొద్దుటూరుకు రెఫర్ చేశారు. ఈకార్యక్రమంలో సంస్థ మండల శాఖ చైర్మన్ డి.రఘురామిరెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ రామాంజనేయరెడ్డి, రాజవర్దన్ రెడ్డి, ఎస్.మధుసూధన్‌రెడ్డి, సతీష్‌కుమార్, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

మొల్ల కీర్తి సాహితీ జగత్తుకే స్ఫూర్తి

బద్వేలు మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మొల్ల కీర్తి సాహితీ జగత్తుకే స్ఫూర్తి అని నందలూరు ఉన్నత కళాశాల ఉపన్యాసకురాలు పెద్దిరెడ్డి నీలవేణి అన్నారు. ఆదివారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో తెలుగుభాష వికాస ఉద్యమం, కవయిత్రి మొల్ల సాహితీ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మొల్ల జయంతి ఉత్సవానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత హను మంతరావు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, రూరల్ ఎస్‌ఐ రవికుమార్, సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి మనోజ్ పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం విజయవాడ నుంచి బస్సు

బద్వేలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడి యట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 13వతేది విజయవాడ నుంచి కడపకు ప్రత్యేక రిజర్వేషన్‌తో కూడిన బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆర్టీసీ డీఎం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో చదివే విద్యార్థులు బద్వేలు నుంచే రిజర్వేషన్ చేసుకో వచ్చన్నారు. ఇందుకోసం 8886090136 నెంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

జ్యోతిక్షేత్రంపై రాజకీయం చేయడం మానుకోండి

బద్వేలు టౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి):.నియోజకవర్గంలోని కాశినాయన జ్యోతిక్షేత్రంపై రాజకీయాలు చేయడం మానుకోవాలని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జ్యోతిక్షేత్రంపై వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబన్నారు. గత వైసీపీ హయాంలో ఏనాడైనా జ్యోతిక్షేత్రం అభివృద్ధి, నిర్మాణానికి ఏర్పడిన అవరోధాలపై ఆపార్టీ నాయకులు మాట్లాడారా? అని ఆయన ప్రశ్నించారు. వాస్తవాలు ప్రజలందరికీ తెలుసని, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా రాజకీయాలకు అతీతంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

పదితో భవిష్యత్తుకు మంచి ప్రణాళిక వేసుకోవాలి



లక్ష్మణరావును సన్మానిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు భవిష్యత్తుకు చక్కటి ప్రణాళిక వేసుకుని మంచి మార్కులు సాధించాలని బాలాజీ హైస్కూలు డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం బాలాజీ హైస్కూలులో 9వ తరగతి విద్యార్థులు, 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భయాన్ని వదిలి ప్రతి సబ్జెక్టును ఇష్టపడి చదవాలన్నారు. గతంలో 590 మార్కులు సాధించిన విద్యార్థులకు ఫీజును తిరిగి వెనక్కు ఇవ్వడం జరిగిందన్నారు. పాఠశాలలోని విద్యార్థుల నుంచి సమాజ సేవలో భాగస్వాములై నేనున్నాను సేవ చేయడానికి అని మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ స్థాపించి ముందుకు వెళుతున్న సంస్థ చైర్మన్ మోరే లక్ష్మణరావుకు రూ.15 వేలు పాఠశాల వారు వితరణ చేసి సన్మానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్‌రెడ్డి, భరత్‌కుమార్, హెచ్‌ఎం సూర్యమిత్ర, కాశీం, ప్రిన్సిపల్ శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పీఎం ఇంటర్న్‌షిప్ పథకానికి నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని ప్రొద్దుటూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్-1 పావని, సర్కిల్-2 శశిధర్‌రెడ్డిలు పేర్కొన్నారు. యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ పథకానికి టెన్త్, ఇంటర్మీడియట్, డిప్లొమా, లేదా డిగ్రీ చదవిన వారు దరఖాస్తులను ఈనెల 12వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆ తర్వాత వారి విద్యార్హతను బట్టి వివిధ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అప్లై చేసుకోవచ్చన్నారు. వారికి ఏడాదిపాటు శిక్షణ ఇస్తారని ఇందులో నెలకు రూ.5 వేలు ఇవ్వడంతోపాటు తదనంతరం ఆయా కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని వివరించారు. దేశంలో అగ్రగామి 500 కంపెనీల్లో (ఆటోమొబైల్స్, ఫైనాన్స్, హాస్పటాలిటీ, టెక్నాలజీ రంగాల్లో) పనిచేసే అవకాశం కల్పిస్తారని వివరించారు. ఆసక్తి కలిగిన యువత ఆధార్‌కార్డు, ఆధార్‌లింక్ ఫోన్ నంబరు, సంబందిత సర్టిఫికెట్లతో సహాయ కార్మిక అధికారి కార్యాలయం ప్రొద్దుటూరు సర్కిల్-1, సర్కిల్-2లో సంప్రదించాలని పేర్కొన్నారు.

తంబళ్లగొంది మాజీ సర్పంచ్ మృతి



సుబ్బా రెడి (ఫైల్)

అట్లూరు,మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు మండలంలోని తంబళ్లగొంది గ్రామ మాజీ సర్పంచ్, కమలకూరు సింగిల్‌విండో అధ్యక్షుడు మల్లు సుబ్బారెడ్డి(70) ఆదివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. శుక్రవారం బద్వే లుకు వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి తలకు గట్టిగా దెబ్బ తగలడంతో కడప హాస్పిటల్‌కు తరలించి మెరుగైన చికిత్స కోసం తిరుపతి కి తరలించినట్లు బంధువులు తెలిపారు. చికిత్స పొందుదతూ ఆదివారం మృతి చెందినట్లు వారు తెలిపారు. ఆయన 1986లో తంబళ్లగొంది సర్పంచ్‌గా 1996లో కమలకూరు సింగిల్‌విండో అధ్యక్షుడిగా పనిచేసినట్లు తెలిపారు. ఆయన అంత్యక్రియలు సోమవారం నిర్వహిస్తున్నట్లు బంధువు లు తెలిపారు.

ఆర్థిక బకాయిలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

- ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్ డిమాండ్

జమ్మలమడుగు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలపై స్పష్టత ఇవ్వాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జమ్మలమడుగు ఎస్టీయూ రీజినల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 18 నెలలుగా ఉపాధ్యాయులకు జడ్పీఎఫ్ లోన్లు, ఫైనల్ పేమెంట్లు, ఏపీజీఎల్‌ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్లు, ఆర్జిత సెలవుల బకాయిలు సకాలంలో ఇచ్చేటట్లు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కానీ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు సంవత్సర కాలంగా రావాల్సిన బకాయిలపై ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. రీజినల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ పోస్టు ఉండి వారికి డీడీవో కోడ్ వచ్చినప్పటికి వారి జడ్పీఎఫ్ షెడ్యూలు జడ్పీ కార్యాలయానికి రాలేదన్నారు.


శాంతియుత ర్యాలీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా పార్లమెంటు కన్వీనర్

బద్వేలు టౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాయచోటి సమీపంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంలో జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం కడపలో జరగబోయే శాంతియుత ర్యాలీని జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా పార్లమెంటు కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఆదివారం పట్టణం లోని బీజేపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందువులపై దాడి జరిగిన నేప థ్యంలో హిందువులంతా ఐకమత్యంగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భాస్క ర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సూర్య, వేణుగోపాల్ , వెంకటసుబ్బారెడ్డి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతుల మహోత్సవం



ఖాజీపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రంగాపురంలో ఆదివారం ఘనంగా జ్యోతుల వేడుకలను నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే బాలచౌడేశ్వరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలు సమర్పించి గ్రామస్థులు మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి గ్రామంలో భారీ ఎత్తునజ్యోతుల ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా పలు నృత్య కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొని వడ్డిస్తున్న పుల్లారెడ్డి

ముద్దనూరు మార్చి9(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్‌పల్లె రోడ్డులోని మసీదు వద్ద రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.విశ్రాంత తెలుగు అధ్యాపకుడు బూచుపల్లి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఉపవాసం ఉన్న ముస్లింలు ప్రార్ధన అనంతరం విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కుడుముల శశిధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి,ముస్లింలు పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాసాలతో ఆరోగ్యం



జమ్మలమడుగులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉండడం వలన అల్లాహ్ మార్గంలో నడవడమే కాక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం 7 గంటలకు జమ్మలమడుగు మెయిన్‌బజార్ లోని జామియా మసీదులో ఇఫ్తార్ విందులో భూపేశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదు పీఠాధిపతి షాదిక్‌పాషా ఖాద్రి, శిష్యులు ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ప్రతి ముస్లిం రంజాన్ మాసంలో అల్లాహ్ మార్గంలో నడిచి భక్తిమార్గంలో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బేపారి మహ్మద్‌రఫి, రియల్టర్ ఉస్మాన్, దాదాపీర్, నాగూర్, సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా కాశిరెడ్డినాయన విగ్రహ ప్రతిష్ఠ



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

మైలవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కర్మలవారిపల్లె గ్రామ సమీపాన జమ్మలమడుగు-తాడిపత్రి ప్రధాన రహదారి వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో అవధూత కాశిరెడ్డినాయన విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానికులే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 7వ తేదీ నుంచి మూడు రోజులపాటు హోమాలు, ప్రత్యేక పూజలు, పలు కార్యక్రమాలు నిర్వహించారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ముద్దనూరు మండల వ్యవసాయాధికారి క్రిష్ణారెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సత్యహరిశ్చంద్ర నాటకం, చెక్కభజన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులు మంచి మార్గంలో నడవాలి



వెంగమాంబ వార్షికోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టరు

పోరుమామిళ్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి మార్గంలో నడిచి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ట్రిపుల్ ఐటీ డైరెక్టరు డాక్టర్ ఏవీ ఎస్ఎస్ కుమారస్వామి గుప్త, పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసు లు పేర్కొన్నారు. ఆదివారం పోరు మామిళ్లలోని వెంగమాంబ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో 21వ వార్షి కోత్సవ వేడుకలు, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వారు మట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలని సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి పరీక్షలపై శ్రద్ధ చూపాలన్నారు. పరీక్షలకు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా మార్కులతో విజయం సాధించి భవిష్యత్తు కు బంగారు బాట వేసుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హైస్కూలు చైర్మన్ గుర్రం పుల్లప్పనాయుడు, ఉపాధ్యాయుడు గొంటుముక్కల గోవిందు, పశువైద్యాధికారి వెంకటసుబ్బయ్య, కవి రామ్మోహన్, ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, నాగలింగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సొంతగూటికి చేరుకున్న ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నుంచి వైసీపీ సొంతగూటకి ముగ్గురు మున్సిపల్ కౌన్సిలర్లు చేరుకున్నారు. ఆదివారం స్థానిక దొరసానిపల్లెలోని వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి స్వగృహంలో 8 వవార్డు కౌన్సిలరు రాగుల శాంతి 38వవార్డు కౌన్సిలర్ చింపిరి అనిల్‌కుమార్ , 40 వవార్డు కౌన్సిలర్ రావుల కొల్లు అరుణలు రాచమల్లు చేతుల మీదుగా వైసీపీ కండువాలు మార్చుకున్నారు. ఇటీవల కాలంలోనే వైసీపీ నుంచి స్వచ్ఛందంగా టీడీపీలో చేరిన వారంతా తిరిగి వైసీపీ లోచేరారు. దీంతో టీడీపీ నాయకత్వ వైఫల్యమా! లేక కౌన్సిలర్లు వైసీపీ నాయకుల ప్రలోభాలకు గురికాబడ్డారా అనేది చర్చనీయాంశంగా మారింది.

పన్నులు చెల్లించి పురపాలక అభివృద్ధికి సహకరించండి

బద్వేలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పన్ను బకాయిదారులు సకాలంలో చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇంటి పన్నులు పెండింగ్ ఉన్న టాప్ లిస్ట్ తీసి వారికి రెడ్ నోటీసులు అందజేశారు. 23 సచివాలయాలలో పన్నుల వసూళ్ల కొరకు కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, సెలవు రోజులలోనూ మున్సిపల్ కార్యాలయం నందు కౌంటర్ ఓపెన్‌లో ఉంటుందని తెలిపారు.